క్లుప్తంగా

ప్రతిష్ఠా మహోత్సవానికి దద్దాలకు ఆహ్వానం


దద్దాలను ఆహ్వానిస్తున్న నాయకులు

కనిగిరి రూరల్: మండలంలోని బాల వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఈ నెల 14న జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. గ్రామంలోని పట్టాభిరామచంద్ర స్వామి ఆలయంలో నూతనంగా విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని గ్రామ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, కోటంశెట్టి మోహన్‌రావు, కాకర్ల మాధవరావు, వాకుమళ్ల సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఇండ్లా మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు దద్దాల జన్మదిన వేడుకలు

పీసీపల్లి: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ జన్మదిన వేడుకలు శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు.

సైనికులకు మద్దతుగా ఆలయాల్లో పూజలు


పూజలు చేయిస్తున్న బీజేపీ నాయకులు

పామూరు: ఉగ్రవాద దాడిని వ్యతిరేకిస్తూ పాక్‌పై యుద్ధం చేస్తున్న భారతీయులకు, భారత సైనికులకు విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి, అభయాంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేవీ రమణయ్య మాట్లాడుతూ ఉగ్రవాదులకు పాక్ వత్తాసు పలకడం, వారికి అండగా నిలవడం దురదృష్టకరమన్నారు. భారత సైనికులకు యావత్ భారతావని అండగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి కదిరి రూ.4 లక్షల విరాళం


చెక్కు అందజేస్తున్న కదిరి పార్థసారథి

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని గణేషునిపల్లెలో ఇష్టకామాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వారి నూతన ఆలయం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి ఇటీవల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు రూ.4 లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన నివాసంలో విరాళం చెక్కును కదిరి సోదరుడు పార్థసారది ఆలయ కమిటీ సభ్యులు కుక్కా తిరుపతయ్య, సాధు వెంకటేశ్వర్లు, రామస్వామిలకు అందజేశారు. కార్యక్రమంలో రామస్వామి, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, తీకనం బాబూరావు, పులి శేఖర్‌రెడ్డి, మాల్యాద్రిరెడ్డి, వెంకట నారాయణరెడ్డి, పట్నం తిరుపతయ్య, సున్నా నారాయణ, నరేష్ పాల్గొన్నారు.

సీఎండీతో 1104 యూనియన్ నేతల భేటీ

కనిగిరి రూరల్: సీపీడీసీఎల్ డిస్కం నూతన సీఎండీ పి.పుల్లారెడ్డిని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 యూనియన్ నాయకులు శుక్రవారం కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఎండీకి పూలమొక్క అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. 1104 యూనియన్ కార్మికులంతా కష్టపడి పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని, త్వరలో కారుణ్య నియామకాలు చేపడతామని, కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎండీ తెలిపినట్లు యూనియన్ నాయకులు పేర్కొన్నారు. 1104 యూనియన్ ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ హరికృష్ణ, సంజీవరావు, ఎల్ఎస్ఎస్ అనీల్‌కుమార్, వివిధ డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పామూరులో వాహన తనిఖీలు

పామూరు: భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఎస్పీ ఏఆర్ దామోదర్, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌ల ఆదేశాలతో శుక్రవారం మండల కేంద్రం పామూరులో 565 జాయతీ రహదారిపై సీఐ ఎం.భీమానాయక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వివిధ హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలతో పాటు పామూరులోకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సై టి.కిషోర్‌బాబు, సీఎస్‌పురం ఎస్సై ఆర్.సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రమూకలకు భారత్ సరైన జవాబు

- ఆపరేషన్ సిందూర్‌కు పెరుగుతున్న ప్రజల మద్దతు
- సైన్యానికి మా మద్దతు అంటున్న యువత

ఆపరేషన్ సిందూర్

లింగసముద్రం: 'ఆపరేషన్ సిందూర్ 2.0'లో భాగంగా దాయాది పాకిస్తాన్‌కు మన దేశం దీటైన జవాబు ఇస్తోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారత సైనికులు చేస్తున్న పోరాటాలకు ప్రజల నుంచి మా మద్దతు ఉంటుందన్నారు. ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న పాకిస్తాన్ పీచం అణచాలని ముక్తకంఠంతో పలికారు. అంతేకాకుండా యావత్ ప్రపంచానికి మహిళా శక్తి ఏంటో చూపించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌ను వింగ్ కమాండర్, కల్నల్‌లు మహిళలు ముందుండి నడపించడం మహిళా శక్తిని చాటి చెప్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వారి ధైర్య సాహసాలను మెచ్చుకుంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

ఉగ్రవాదులపై మరిన్ని దాడులు చేయాలి..



పాకిస్తాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదులను అన్ని విధాలుగా అణిచివేయాలి. పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి అమాయకపు ప్రజలను కాల్చివేయడం దారుణం. ఉగ్రవాదులను పూర్తిగా అంతం చేయాలి. ఉగ్రవాదులపై భారత్ చేస్తున్న పోరాటం అమోఘం.

– డీ మల్లికార్జున, సర్పంచ్, ఎర్రారెడ్డిపాలెం

పాక్‌కు బుద్ధి చెప్పాల్సిందే..



ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైంది. ఇంకా మిగిలి ఉన్న ఉగ్రవాదుల స్థావరాలను భారత్ ధ్వంసం చేయాలి. భారత్ అన్ని విధాలా ముందుకు దూసుకుపోవాలి. సైన్యానికి ప్రజలు పూర్తిసహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఎం.సాయికుమార్, రాళ్లపాడు

మహిళామణుల ధైర్యసాహసాలు అమోఘం..



పాకిస్తాన్‌లో నివాసం ఏర్పరచుకున్న ఉగ్రవాదులపై ముప్పేట దాడి చేయటంలో సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ధైర్యసాహసాలను మెచ్చుకోవాలి. ఆపరేషన్ సిందూర్‌లో మహిళలు ఉండటం హర్షణీయం. వీరు మహిళలు స్ఫూర్తిదాయకం.

చెన్ను నళినీపద్మ, జెడ్పీటీసీ

ఓటరుకు ఆధార్ అనుసంధానం చేయాలి


మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఏ.కుమార్

కొండపి: ఓటరు జాబితాలోని ప్రతి ఓటరుకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి అరవ కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఓటర్‌కు దరఖాస్తు చేయడానికి ఫారం-6 అప్లై చేయించాలని, పోలింగ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఓటర్ మరణించిన వారిని గుర్తించి ఓటర్ లిస్టు నుంచి తొలగించేందుకు ఓటర్ లిస్టులో ఓటర్ల విషయంలో తప్పులు, ఓటును ఒకచోట నుంచి మరొక చోటకి బదిలీ చేసుకోవడానికి వచ్చిన వాటిని ఫాం-8 ద్వారా అప్లై చేయించాలన్నారు. 1200 మంది ఓటర్ల కంటే ఎక్కువ కలిగిన పోలింగ్ కేంద్రాలను, 2 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం కలిగిన కేంద్రాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు పి.మురళి, జ్వాలా నరసింహం, జనార్దన్, పుల్లారావు, ఆంజనేయులు, సింగరాయకొండ డిప్యూటీ తహసీల్దార్ ముస్తాక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పీ సురేఖ, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు షేక్ వన్నూరు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం


పట్టణంలో కలశ మహోత్సవం

కనిగిరి రూరల్: స్థానిక దొంతులమ్మ గుడిలో కొలువై ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల, కళ ఉత్సవ కార్యక్రమం శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. పట్టణంలోని కనకదుర్గమ్మ కోవెల నుంచి మహిళలు 108 కలశాలతో పవిత్ర గంగా జలం నింపుకుని ప్రదర్శన చేశారు. అనంతరం పోలేరమ్మ తల్లి ఆలయానికి చేరుకుని, పవిత్ర గంగా జలాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఆలయ కమిటీ నాయకులు టంగులూరి గోవిందరావు, కొప్పరపు కోటేశ్వరరావు, ముండ్లమూరి మాలకొండయ్య, వాకమల్ల కిశోర్, ఇన్నమూరి సుబ్బారావు, ఆంధ్ర శ్రీనివాసులు, కంచర్ల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.280

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280కు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఎం.నిడమానూరు క్లస్టరు గ్రామాలకి చెందిన రైతులు 679 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 592 కొనుగోలు చేశారు, 87 బేళ్ల తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.259.96 ధర పలికిందని ఇన్‌చార్జి వేలం నిర్వహణాధికారి సత్య శ్రీనివాస్ తెలిపారు.

949 బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 949 బేళ్లు కొనుగోలయినట్లు ఇన్చార్జి వేలం నిర్వహణ అధికారి శివకుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని దాదానాయుడుపాలెం, చౌటపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి, పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1123 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 949 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 174 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.210 సరాసరి ధర కేజీ రూ.253.04 గా నమోదైంది.

పశుబీమా చేయించాలి

హనుమంతునిపాడు: పశుపోషకులతో ప్రతీ గేదెకు పశుబీమా చేయించాలని హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాల పశువైద్యశాఖ ఏడీఏ మేకల అరుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాల పశువైద్య సహాయకులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్‌గా సోకే వ్యాధులకు, విపత్తి సమయంలో సంభవించే ప్రమాదాలకు గురై పశువులు అకాలంగా మృతి చెందితే బీమా వర్తిస్తుందని చెప్పారు. ప్రతి కుటుంబానికి 10 పశువుల వరకు పశుబీమా వర్తిస్తుందన్నారు. ఒకసారి పశుబీమా చేయిస్తే మూడేళ్ల వరకు ఫోర్స్‌లో ఉంటుందన్నారు. సమావేశంలో పశువైద్యులు, సహాయకులు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన మురళి నాయక్

సింగరాయకొండ: ధర్మ యుద్ధంలో దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన యుద్ధ వీరుడు భరతమాత ముద్దుబిడ్డ మురళి నాయక్ అని వైఎస్ఆర్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కల్లితాండకు చెందిన ఆర్మీ జవాన్ మురళి నాయక్ పాకిస్థాన్ బోర్డర్ దగ్గర జరిగిన కాల్పుల్లో చనిపోవడం బాధాకరమని ఒక ప్రకటనలో అన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్

కొండపి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సూపర్‌వైజర్ విక్టోరియా రాణి అన్నారు. కిశోరి వికాసంలో భాగంగా శుక్రవారం దాసరెడ్డిపాలెంలో పునరుత్పత్తి ఆరోగ్యం- బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలపై బాలికలకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వలన రక్తహీనత, గర్భస్రావం, శిశు మరణాలు, మాత మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేసుకోకూడదని అన్నారు. అలా వివాహం చేసుకుంటే అనేక ఇబ్బందులు తలెత్తుతాయని బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారిపై కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. మండలంలోని 14 సచివాలయాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శులు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏఎన్ఎంలు మహిళా సంరక్షణ కార్యదర్శులు, బాలికలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే పోలీసుల పల్లెనిద్ర


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: నేరాల నియంత్రణకి పోలీసులు పల్లెనిద్రలు చేస్తున్నారని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య అన్నారు. సింగరాయకొండ మండలంలోని పెద్ద కనుమల్ల గ్రామంలో శుక్రవారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో పలు విషయాలు చర్చించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో నిద్రించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.





ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్చండి

టంగుటూరు: తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పాలని ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి కోరారు. పాఠశాలలో విద్యార్థులను చేర్పించటంలో భాగంగా శుక్రవారం పాఠశాల పరిధిలోని మల్లవరప్పాడు, శివపురం, నాయుడుపాలెం, బాబూజీ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు.





